సాక్షి
బాపట్ల

బుధవారం । 28 । జూన్ । 2023



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నేత కడవకొల్లు నరసింహారావు మంగళవారం దర్శించుకున్నారు.



బాలల రక్షణకు చర్యలు

నెహ్రూనగర్: బాలల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌పై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

రేవతికి రజతం



తెనాలి: నెల్లూరులో జరిగిన పవర్‌లిఫ్టింగ్, బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 69 కిలోల విభాగంలో తెనాలికి చెందిన వక్కలగడ్డ రేవతి రజత పతకం సాధించింది. శ్రీషిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ తరపున కె.లక్ష్మణబాబు మంగళవారం సత్కరించారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుని హుండీ ఆదాయం రూ.53.05లక్షలు



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.53,05,561 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో గొలమూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. నరసరావుపేట గ్రూప్–2 ఆలయాల కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వరరావు లెక్కింపును పర్యవేక్షించారు. హుండీల ద్వారా ద్వారా బంగారం 24గ్రాములు, వెండి 502గ్రాములు వచ్చినట్లు వివరించారు. హుండీల ద్వారా గతేడాది కన్నా రూ.8,42,366 అధికంగా ఆదాయం లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, తంగేడుమల్లి కేనరా బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, నరసరావుపేట సేవక బృందాలు పాల్గొన్నారు.

యార్డులో 38,969 బస్తాల మిర్చి విక్రయం




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,400 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,969 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళకు రూ.9,500 నుంచి 22,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,200 నుంచి రూ. 24,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,072 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.70 అడుగుల వద్ద ఉంది. ఇది 33.5776 టీఎంసీలకు సమానం.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు



కొరిటిపాడు(గుంటూరు): నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తోటకూర శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని పట్నంబజారు, బస్టాండ్, రాజాగారితోట ప్రాంతాల్లోని విత్తన షాపులు, గోడౌన్లలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లు, దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అలాగే అమ్మకం, కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు. తనిఖీల్లో అనుమతి లేని రూ.14,31,050 విలువ చేసే 3 వేల మిరప విత్తన ప్యాకెట్లు, 9 ప్రత్తి విత్తన ప్యాకెట్లను గుర్తించారు. ఆయా విత్తనాలకు సంబంధించి సరైన సర్టిఫికేట్లు చూపకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో ఏడీఏలు సీహెచ్ సునీత, సీహెచ్ తిరుమలాదేవి, ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, ఐ.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆక్వా అభివృద్ధికి ప్రో'సీడ్'

నిజాంపట్నం వద్ద ఆక్వా పార్క్‌తో నాణ్యమైన సీడ్ లభ్యం

- రొయ్యలు, సముద్ర చేపలు, పీతల సీడ్ కోసం ఇప్పటివరకు ఇతర రాష్ట్రాలకు వెళుతున్న ఆక్వా రైతులు
- రూ.185కోట్లతో 280 ఎకరాలలో పార్కు నిర్మాణం
- ప్రస్తుతం జిల్లాలో 21,400 ఎకరాలలో ఆక్వా సాగు
- పార్కు ఏర్పాటుతో మరో పదివేలకు పెరగనున్న సాగు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి



ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్న స్థలం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలోని నిజాంపట్నంలో ఆక్వా పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం కావడంతో ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే పార్కు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం రైతులకు వరంగా మారనుంది. పార్కువల్ల రైతులకు స్థానికంగా నాణ్యమైన సీడ్ దొరకనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వారైతులు చెన్నై, ఇతర రాష్ట్రాలకు సీడ్ కోసం వెళ్లాల్సిన అవసరం ఉండదు. పైగా ప్రాసెసింగ్ యూనిట్లను పార్కులో ఏర్పాటు చేయనుండడంతో రైతులకు మరింత అనుకూలంగా మారనుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒక్క బాపట్ల జిల్లాలోనే అదనంగా పదివేల ఎకరాల్లో ఆక్వా సాగు పెరగనుండగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద మొత్తంలో రైతులు ఆక్వా సాగు వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

వెనామిపై విముఖత

ఇప్పటి వరకు జిల్లాలోని రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవారిపాలెం, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, నగరం, భట్టిప్రోలు తదితర మండలాల పరిధిలో 21,400 ఎకరాలలో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. 2013 నుంచి వెనామి రకం 80 శాతానికి పైగా సాగు చేస్తుండగా మిగిలిన రకాలు కొద్ది మొత్తంలో సాగులో ఉన్నాయి. రానురాను వైట్ స్పాట్, విబిరో తదితర వైరస్‌ల ప్రభావం పెరగడంతో వెనామి దిగుబడి తగ్గి రైతులకు నష్టాలు మిగిలాయి. సీడ్ క్వాలిటీ పూర్తిగా తగ్గిపోయింది. వేసిన సీడ్‌లో 60 శాతం కూడా బతకని పరిస్థితి. దీంతో వెనామి పట్ల రైతులు విముఖత చూపారు.

తెరపైకి మోనో ఆక్వాలామా (టైగర్)..

2021 నుంచి మోనోఆక్వాలామా (టైగర్) రకం వైపు రైతులు మొగ్గు చూపారు. దీంతో సాగు పెరిగింది. ప్రారంభంలో ధరలు బాగుండడంతో రైతులకు లాభాలు ఆర్జించిపెట్టాయి. రానురాను వీటి దిగుబడి కూడా తగ్గింది. నాసిరకం సీడ్ వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రైతుల వాదన. కొన్ని ప్రైవేటు కంపెనీలు నాసిరకం సీడ్ అంటగడుతుండటంతో రైతులు నష్టపోయారు.

పీతలు, పండుగప్పల సాగుకు మొగ్గు..

రైతులు నష్టాల కష్టాల నుంచి గట్టెక్కేందుకు పీతలు, పండుగప్పలు, కొంత మేర టైగర్ రొయ్య రకాల సాగు వైపు మొగ్గారు. ఈ రకాల సీడ్ స్థానికంగా దొరకక పోవడంతో రైతులు తమిళనాడులోని పాండిచ్చేరి, రామేశ్వరం, రామనాధపురం తదితర ప్రాంతాలకు వెళ్లితెచ్చుకోవాల్సి వస్తుంది. దీని వలన ట్రాన్స్‌పోర్టు ఖర్చులు పెరిగి రెతులకు ఆర్థిక భారంగా మారింది.

ఆక్వా పార్కుతో అన్నిరకాలుగా ఉపయోగం

నిజాంపట్నం మండలంలోని పరిశావారిపాలెం వద్ద ఆక్వా పార్కు ఏర్పాటు చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. రూ.185 కోట్లతో 280 ఎకరాలలో పార్కును నిర్మిస్తున్నారు. ఇటీవల నిజాంపట్నం పర్యటనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పార్కులో పీతలు, పండుగప్పలతో పాటు పలు రకాల చేపలు, రొయ్యల సీడ్‌ను ఉత్పత్తి చేయనున్నారు. దీంతో పాటు ప్రాసెసింగ్ యూనిట్లను సైతం ఏర్పాటు చేయనున్నారు. ఆక్వా పార్కు నిర్మాణం పూర్తయితే రైతులకు అవసరమైన సీడ్ స్థానికంగానే అందుబాటులోకి రానుంది. దీంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం వ్యాపారులు రైతుల నుంచి రొయ్యలు, చేపలు కొనుగోలు చేసి కృష్ణపట్నం, కాకినాడ, చెన్నై ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడే ప్రాసెసింగ్ చేసి ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా ప్రాసెసింగ్ యూనిట్ లేకపోవడంతో వ్యాపారులు ఆ మేరకు ధరలు తగ్గించడంవల్ల రెతులకు గిట్టుబాటు కావడంలేదు.

ఏటా రూ.2వేల కోట్లకు పైగా ఎగుమతులు..

జిల్లాలో ఏటా రూ.2వేల కోట్ల రొయ్యల ఎగుమతులు, రూ.250 కోట్ల మేర చేపల ఎగుమతులు జరుగుతున్నాయి. జిల్లా నుంచి ఏటా 52 దేశాలకు రొయ్యలు కృష్ణపట్నం, చెన్నై, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతులు జరుగుతున్నాయి. 39శాతం ఎగుమతులు అమెరికాకు, 20 శాతం చైనాకు, 11 శాతం యూరోపియన్ యూనియన్, 6 శాతం వియత్నాం, 5శాతం జపాన్‌కు చొప్పున పలు దేశాలకు రొయ్యల ఎగుమతులు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో రొయ్యల సాగు ఆశాజనకంగా లేకపోవడంతో దిగుమతులు తగ్గాయి. ఇక్కడ ఆక్వా పార్కు ఏర్పాటుతో ఆక్వారంగం పుంజుకోనుంది.

ఆక్వా పార్కుతో మరింత మేలు..



ఈ ప్రాంతంలో ఆక్వా పార్కు ఏర్పాటు చేయడం రైతులకు వరం. మాప్రాంతంలో రొయ్యల సాగుతో పాటు పీతల సాగు ఎక్కువగా ఉంటుంది. స్థానికంగా పీతల సీడ్ దొరకదు. తమిళనాడు ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రాన్స్‌పోర్టు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడే సీడ్ దొరికితే గిట్టుబాటు ధర లభిస్తుంది.

– మోపిదేవి శివనాగేశ్వరరావు, ఆక్వా రైతు, నిజాంపట్నం

ప్రభుత్వానికి ధన్యావాదాలు



మా మండలంలో ఆక్వా పార్కు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు. పార్కు వస్తే అన్ని రకాల సీడ్ ఇక్కడే దొరుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లే పనిలేదు. రవాణా ఖర్చులు మిగులుతాయి. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వలన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– కొక్కిలిగడ్డ జగదీష్, నిజాంపట్నం మండలం

8న సీఆర్డీఏ పరిధిలో ఇళ్లకు శంకుస్థాపన

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: సీఆర్డీఏ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో వచ్చే నెల 8న శంకుస్థాపన చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శంకుస్థాపనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు అధికారులు వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్డీఏలోని ఇళ్ల స్థలాల విషయం ప్రముఖంగా నిలిచిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయడంతోపాటు నిర్మాణాలు నిర్విరామంగా జరిగేట్లు చూడాలని చెప్పారు. ఆప్షన్–3 కింద నిర్మించే గృహాలను కాంట్రాక్టర్లకు మ్యాపింగ్ చేసి బ్యాంకు ఖాతాలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సర్వే కోడ్ జనరేట్ చేసిన లబ్ధిదారులకు ప్లాట్‌లను జియో ట్యాగింగ్ చేయాలని తెలిపారు. లే అవుట్స్ నిర్మాణాలకు సంబంధించిన కావాల్సిన నీటి సదుపాయం, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయా శాఖాధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీఓ శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధర

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులోమంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.2000, మోడల్ ధర రూ.1400 వరకు పలికింది.

ఆ కార్యదర్శులు సం'పన్ను'లు!

- పన్ను వసూలు పేరిట పంచాయతీ నిధులు మింగేస్తున్న కొందరు కార్యదర్శులు
- రూ.కోట్లలో అవినీతి భాగోతాలు
- నిధులు లేక అభివృద్ధి పనులకు ఆటంకం
- ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపితే అక్రమాలు బట్టబయలయ్యే అవకాశం



వేటపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం

చీరాల/వేటపాలెం: కంచే చేను మేను మేస్తే అనే చందంగా మారింది కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శుల వ్యవహారం. ఆయా గ్రామాల్లో మౌలిక వసతులకు వినియోగించాల్సిన నిధులను కొందరు కార్యదర్శులు దారి మళ్లిస్తున్నారు. పంచాయతీ ఖాతాలకు జమ చేయకుండా తమ జేబుల్లో వేసుకుంటున్నారు. రూ.కోట్లలో ఈ అవినీతి వ్యవహారం కొనసాగుతోంది. పంచాయతీకి ప్రజలు కట్టిన ఇంటి పన్నులు కొందరు అవినీతి కార్యదర్శుల పాలవుతున్నాయి. ఈ అక్రమ వ్యవహారంపై ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో సమాచారం ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిచడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో తెలియాల్సి ఉంది. ఇప్పటికే కొన్న పంచాయతీల్లో జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపినప్పటికీ అది బయటకి పొక్కకుండా ఉండటం విశేషం.

అవినీతి జరుగుతుంది ఇలా..

కరోనా సమయంలో రెండేళ్ల పాటు గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు మందగించాయి. అప్పట్లో పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. దీన్ని కార్యదర్శులు, సిబ్బంది ఆసరాగా తీసుకున్నారు. కరోనా అనంతరం పంచాయతీ రాజ్ శాఖ గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీంతో పాత బకాయిలతో సహా కోట్ల రూపాయలు పన్నులు రూపంలో వసూలు జరిగాయి. అయితే కార్యదర్శులు వసూలు చేసిన నగదు పంచాయతీ బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా వసూలు చేసిన నగదను పక్కదారి పట్టించారు. నియోజకవర్గంలో చీరాల రూరల్ పరిధిలో 16, వేటపాలెం మండలం పరిధిలో 9 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేజర్ పంచాయతీలో అధిక మొత్తంలో నిధులు గోల్‌మాల్ జరిగాయి. వీటితో పాటు మైనర్ పంచాయతీల్లో కూడా రూ.లక్షల్లో గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. వేటపాలెం గ్రామ పంచాయతీలో రూ.12 లక్షలు నిధులు మాయమైనట్లు గుర్తించారు. దీనిపై విచారణ జరిపించారు. అయితే దీని తాలుకు రూ.9 లక్షలు తిరిగి పంచాయతీ ఖాతాకు జమచేశారు. మరలా తిరిగి గడిచిన ఆరు నెలల వ్యవధిలో అదే పంచాయతీలో మరో రూ.5 లక్షలు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. రామన్నపేట పంచాయతీలో రూ. 12 లక్షల నిధులు ఖాతాకు జమ చేయకుండా అప్పటి కార్యదర్శి గోల్‌మాల్ చేశాడు. ఆ కార్యదర్శి బదిలీపై వెళ్తూ కేవలం రూ.6 లక్షలు తిరిగి బ్యాంకు ఖాతాకు జమచేసి వెళ్లిపోయాడు.

పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం..



మండల పరిధిలో కొన్ని పంచాయతీల్లో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలో వీటిపై విచారణ చేయిస్తాం. రామన్నపేట, వేటపాలెం, కొత్తపేటలో అక్రమాలు జరిగిట్లు తెలిసింది. వీటితో పాటు మిగిలిన పంచాయతీలపై కూడా పరిశీలిన చేస్తాం.

– ఎంపీఎస్ శర్మ, ఎంపీడీఓ, వేటపాలెం

దీనిపై ఎటువంటి విచారణ జరగలేదు. కొత్తపేట పంచాయతీలో గడిచిన ఐదేళ్ల నుంచి రూ. కోటి పైచిలుకు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపారు. కానీ విచారణ విషయాలు బయటికి పొక్కకుండా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఐదేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనే..

నియోజకవర్గ పరిధిలో గడిచిన ఐదేళ్లుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. అయితే ఈ ప్రత్యేక అధికారులు వారి మాతృశాఖ పనులు చూసుకుంటూ నెలకు రెండుసార్లు వచ్చి వెళ్తుంటారు. 2018 ఆగస్టులో సర్పంచ్‌ల పాలన ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. 2021 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అయితే నియోజకవర్గంలో బైఫర్‌కేషన్‌లో భాగంగా కొన్ని కొత్త పంచాయతీలు ఏర్పాటు చేశారు. దీనిపై టీడీపీ నాయకులు హైకోర్టుకు వెళ్లడంతో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. అప్పటినుంచి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతోంది.

అభివృద్ధికి ఆటంకం..

కార్యదర్శులు గ్రామంలో పన్నుల రూపంలో వసూలు చేసిన లక్షల రూపాయల నిధులు గోల్‌మాల్ చేయడంతో గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారింది. నిధులు గోల్‌మాల్ జరిగినట్లు జిల్లాస్థాయి అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపకపోవడంపై ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు నిధుల గోల్‌మాల్‌పై లోతైన విచారణ చేసి అక్రమార్కుల నుంచి తిరిగి నగదు రాబట్టాల్సి ఉంది.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం కల్పిస్తూ రుణాలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయకమిటీ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ అత్యధిక రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు బాపట్ల జిల్లాలో అధికంగా ఉన్నందున రైతులకు రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. బాపట్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రూ.3 వేల 595 కోట్లు, రబీ సీజన్‌లో రూ.2,498 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు రూ.2,981 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల అభివృద్ధికి రూ.854 కోట్లు రుణం ఇవ్వాలని లక్ష్యాలు నిర్దేశించినట్లు తెలిపారు. విద్యారంగానికి రూ.53 కోట్లు, గృహనిర్మాణ రంగానికి రూ.218 కోట్లు, సామాజిక రంగాల అభివృద్ధికి రూ.13 కోట్లు, ఇతర రంగాలకు రూ.648 కోట్లు రుణాలు ఇస్తామన్నారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ.1,242 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యాలు నిర్దేశించుకున్నామన్నారు. ప్రాధాన్యత, ప్రాధాన్యత లేని రంగాల అభివృద్ధికి జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.11,860 కోట్లు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగితే తద్వారా అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందుకోసం కౌలు రైతులకు ప్రత్యేకంగా రుణాలు ఇవ్వాలని చెప్పారు. 43 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. వారందరికీ పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు ఆయన సూచించారు. వివిధ రంగాల అభివృద్ధికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.12,397.68 కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. గత ఏడాది ఆయా రంగాలకు లక్ష్యాలకు మించి రుణసదుపాయం కల్పించామన్నారు. బ్యాంకులు లక్ష్యాలు చేరుకోవడంలో 138.59 శాతం పురోగతి సాధించాయన్నారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో మత్స్య, వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా ఉన్నాయన్నారు. వాటి ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. అధికారులు వినూత్నంగా ఆలోచించాలని, జిల్లా అభివృద్ధికి బహుళ ప్రయోజనం కలిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. లైవ్ ఫిషింగ్ యూనిట్ల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేలా కృషి చేయాలని కోరారు. అధికారులు మూస పద్ధతిలో పనిచేయకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అడుగులు ముందుకు వేయాలన్నారు. 5 కి.మీ దూరానికి ఒక బ్యాంకు ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాలలో ఫార్మర్స్ ఏటీఎంల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. జగనన్న తోడు పథకం రుణ పంపిణీలో బ్యాంకు అధికారులు పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం శివకృష్ణ, ఆర్‌బీఐ ఎల్‌డీఓ నాగప్రవీణ్, డీసీసీ కన్వీనర్ డి.శంకర్రావు, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సాయం.. ఒడి చేరే తరుణం

- నేడు నాలుగో విడత అమ్మఒడి నిధుల విడుదల
- బాపట్ల జిల్లాలో 117827మంది అర్హులుగా గుర్తింపు
- తల్లుల ఖాతాల్లో రూ.176.74 కోట్ల నగదు జమ



బాపట్ల అర్బన్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చింది. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తూ.. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దుతోంది. ఎన్ని కష్టాలొచ్చినా విద్యార్థుల చదువులు ఆగకూడదనే కృత నిశ్చయంతో విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యమిస్తోంది. దీంతోపాటు విద్యా కానుక వంటి పథకాల ద్వారా విద్యార్థులను బడి బాట పట్టిస్తోంది. జూన్ మాసంలో పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాల తీసిన రోజే విద్యా కానుక కిట్ అందించారు. తాజాగా అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టి .. విజయవంతంగా నాలుగో విడత అమలు చేస్తున్నారు. నేడు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి నాలుగో విడత డబ్బులను బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేయనున్నారు.

అర్హులందరికీ అమ్మఒడి...

అమ్మఒడి నాలుగో విడత జాబితాను ఇప్పటికే అన్ని సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. అర్హులు, అనర్హుల జాబితాలను ఉంచారు. అనర్హుల జాబితాపై ఆయా సెక్రటరీల ద్వారా తగిన కారణాలను వివరించారు. ఎవరైనా పొరపాటున అర్హులై ఉండి అనర్హుల జాబితాలోకి వెళితే.. వారి వివరాలను తీసుకుని మళ్లీ అర్హుల జాబితాలోకి మార్చారు. ఈ నెల 27వ తేదీ వరకు అమ్మ ఒడి లబ్ధిదారులకు సంబంధించి తల్లులతో ఈకేవైసీ చేయించారు. దీని ద్వారా అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకూడదనే సంకల్పంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో ఇలా..

బాపట్ల జిల్లాలో 1456 ప్రభుత్వ, 299 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 103417 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 65,361మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1,17827 మందిని అర్హులుగా గుర్తించారు. జిల్లాలో అర్హత సాధించిన వారందరికీ అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.13 వేల నగదు జమ కానుంది.

గత మూడేళ్లలో అమ్మఒడి లబ్ధి ఇలా..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	పొందిన లబ్ధి (కోట్లలో)
2019- 20	114550	171.82
2020-21	116019	174.02
2021-22	119953	179.93

2022–23వ సంవత్సరంలో 117827 మంది విద్యార్థులకు రూ.176.74 కోట్లు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు

పారదర్శంగా చేపట్టాం



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా అనేక పథకాలను అమలు చేస్తోంది. బాపట్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అర్హుల జాబితాలను ఎంతో పారదర్శంగా చేపట్టాం. అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించి.. ఆయా కారణాలతో వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే గుర్తించి వారికి అమ్మ ఒడి అమలయ్యేలా చర్యలు చేపట్టాం.

– రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

రౌడీషీటర్ హత్య కేసులో నలుగురు అరెస్ట్

- కుమారుడి హత్యకు తల్లి ప్రతీకారం..
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మహేష్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

నరసరావుపేట: కుమారుడి హత్యకు ప్రతీకారంగా తల్లి ప్లాన్ చేసి ఎస్ఆర్‌కేటీకి చెందిన రౌడీషీటర్ బాజీని హత్య చేయించిందని డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ టీకొట్టు బాజీగా పేరొందిన షేక్ బాజి కొంతకాలం క్రితం పఠాన్‌బీ పెద్దకుమారుడైన పఠాన్ సుభానీని హత్య చేశాడు. దీనిపై కక్ష పెంచుకున్న పఠాన్‌బీ తన కుమారుడి హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. బాజీతో గత కొంతకాలంగా మంచిగా మాట్లాడుతూ నమ్మించి ఫోన్ చేయించి 20వ తేదీ రాత్రి పుట్టినరోజు వేడుకలంటూ హుసేన్ ఇంటివద్దకు పిలిపించింది. పఠాన్ జాన్‌బీ తమ్ముడు హుసేన్, చిన్న కుమారుడు సంధాని, ముళ్లపూడి గోపికృష్ణ, హరీష్‌తో కలసి బాజీని చంపేందుకు నిర్ణయించుకొని పార్టీకి వచ్చిన బాజీ కళ్లల్లో కారం చల్లి కత్తులు, రాడ్‌లతో నరికి చంపారు. శవాన్ని మాయం చేయాలనే ఉద్దేశంతో ఎస్ఆర్‌కేటీ ఆరో లైను శివారులోని పొలాల్లోకి మృతదేహాన్ని తీసుకెళ్లి పెట్రోలు పోసి తగులపెట్టి సగం కాలిన శవాన్ని పూడ్చిపెట్టి పారిపోయారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్ఐ బాలనాగిరెడ్డితో ఏర్పాటు చేసిన బృందం నిందితులను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ వివరించారు.

పోలీస్ సిబ్బంది సౌలభ్యానికి క్యాంటీన్

ఎస్పీ వకుల్‌జిందాల్



నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్ పనులు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ సిబ్బంది సౌలభ్యం కోసమే క్యాంటీన్ నిర్మాణం చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ సిబ్బంది కోసం ఏర్పాటు చేస్తున్న అల్పాహార క్యాంటీన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్యాంటీన్ లాభాపేక్ష ఆకాంక్షించకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. పనులు పరిశీలించి అధికారులకు నిర్మాణ విషయంలో కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు పాల్గొన్నారు.

యువతరం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కిరణ్మయిరెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యువతరం బాధ్యతాయుతంగా ఉండాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం గుంటూరు నెహ్రూ యువకేంద్ర, హిందూ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ ఉత్సవ్–2023 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాస, సాంస్కృతిక అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయన్నారు. దేశం పట్ల ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని, యువతరం తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని ప్రతిభను ప్రదర్శించేందుకు ఇటువంటి ఉత్సవాలు చక్కటి వేదికలుగా ఉపయోగపడతాయని చెప్పారు. యువ ఉత్సవ్ థీమ్ ఐన పంచ్ ప్రాణ్ అంశాలను వివరించారు. యువత చేతుల్లోనే దేశ భవిత దాగి ఉందని, వారి శక్తిని మనం సరైన దారిలో ఉపయోగించడం ద్వారా భారతదేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చన్నారు. గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి వారిలో ఉత్తేజం నింపటంతో పాటు మన దేశ విలువలను, సాంస్కృతిక వారసత్వాలను కాపాడేందుకు ఇటువంటి యువ ఉత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రేమ వివాహం వద్దన్నారని..

యువతి ఆత్మహత్య

నాదెండ్ల: ప్రేమించి పెళ్లి చేసుకున్న మొదటి వివాహం సంప్రదాయబద్ధంగా లేదని తల్లిదండ్రులు భర్త నుంచి వేరు చేశారు. ఆపై కొద్ది నెలలకే మరొకరిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు ప్రతిపాదన చెప్పటంతో తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయటంతో యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గణపవరంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఒడిశా రాష్ట్రం బద్ర్ జిల్లా కాన్పూరుకు చెందిన మల్లిక్ రంజన్‌కుమార్, సనాతన దంపతులకు ముగ్గురు సంతానం. సుమారు ఐదేళ్ల క్రితం వలస వచ్చి చిలకలూరిపేట రూరల్ మండలం బొప్పూడిలో ఉంటూ టెక్స్‌టైల్స్ మిల్లులో పనిచేస్తున్నారు. అయితే 2019లో కరోనా కారణంగా కంపెనీలు లాక్‌డౌన్ ప్రకటించటంతో తిరిగి ఆ కుటుంబం ఒడిశాకు వెళ్ళింది. ఏడాది క్రితం పనుల కోసం తిరిగి వచ్చారు. లాక్‌డౌన్ సమయంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన దేవేందర్‌ను ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే తల్లిదండ్రులు వివాహాన్ని ఒప్పుకోకపోవటంతో మోనాలిసా తల్లిదండ్రుల వద్దనే ఉంది. కొద్దినెలల క్రితం మోనాలిసాను తల్లిదండ్రులు పనుల నిమిత్తం చెన్నైకు పంపారు. అక్కడ పని చేస్తున్న సమయంలో కాకినాడకు చెందిన ఓ యువకుడు పరిచయం కావటంతో ప్రేమలో పడి వివాహం చేసుకుంది. తల్లిదండ్రుల వలన తనకు ప్రాణహాని ఉందని కాకినాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాకినాడ పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం మోనాలిసాను తల్లిదండ్రులతో పాటూ నాదెండ్ల మండలం గణపవరంలో నివాసం ఉండే మేనమామ ఇంటికి తీసుకొచ్చారు. ఈ నెల 23న క్రితం మేనమామ ఇంటి వద్దే ఘర్షణ పడి తాను ప్రేమించిన యువకుడితో వివాహం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, వైద్యం పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు రావటంతో గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ తిరగబడి మాజీ సర్పంచి మృతి

అద్దంకి: ట్రాక్టర్ తిరగబడి మాజీ సర్పంచి మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాయిపాలెంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మాజీసర్పంచి తోకల వెంకటేశ్వర్లు(75) అద్దంకి సమీపంలో తన పొలంలో ట్రాక్టర్ దున్నడం కోసం వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతుకుతూ పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే ట్రాక్టర్ కిందపడి ఉన్నట్లు గుర్తించారు. గతంలో మూడేళ్ల క్రితం వెంకటేశ్వర్లు చిన్న కుమారుడు సుబ్బారావు ఇదే విధంగా ట్రాక్టర్ తిరగబడి చనిపోయాడు. ఆ విషయం తెలుసుకున్న తల్లి కూడా మృతి చెందింది. ఈ మూడేళ్ల లోపలే కుటుంబ సభ్యులు ముగ్గురు మృతి చెందడంతో ఆ కుటుంబంలో శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నేడు రేపల్లెలో అమ్మఒడి పథకం ప్రారంభ సభ



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

రేపల్లె రూరల్: పేదలకు కార్పొరేట్ విద్యను చేరువ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి పీజేవీ రామారావు అన్నారు. రేపల్లెలో ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా వ్యాప్తంగా అమ్మ ఒడి పథకం రేపల్లెలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిలతో పాటు పలువురు అధికారులు, ప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. పట్టణంలోని రామకోటిపేటలోని పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశంలో ఎంఈఓలు నవీన్‌కుమార్, రత్నశ్రీధర్, హరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి వృద్ధుడికి గాయాలు



వృద్ధుడిని గుంతలో నుంచి బయటికి తీసిన పోలీసులు

వేటపాలెం: పూలు కోయడానికి వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్ గుంతలో పడిపోయిన ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం వస్‌వే రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసం ఉండే కాపూరి సాంబయ్య ప్రతి రోజు ఉదయాన్నే వస్‌వే రోడ్డు పక్కన ఉన్న శివాలయానికి వెళ్తుంటాడు. రోజు మాదిరిగా శివాలయానికి ఉదయం బయలు దేరాడు. అదే రోడ్డులో ఒక ఇంటి గోడ పక్కన పూల చెట్టు ఉండడాన్ని గమనించి పూలు కోసుకోవడానికి వెళ్లిన వృద్ధుడు గోడ పక్కనే ఉన్న సెప్టిక్ ట్యాంక్ పైకి ఎక్కి పూలు కోసుకొంటున్న సమయంలో ట్యాంక్ మూత విరిగి పోయింది. దీంతో వృద్ధుడు సెప్టిక్ ట్యాంక్ గుంటలో పడిపోయాడు. గుంటలో ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. లోతైన గుంట కావడంతో క్రేన్ తెప్పించి గుంటలో పడిన వృద్ధుడిని బయటికి తీశారు. చాలా రోజుల నుంచి ఆ సెప్టిక్ ట్యాంకు వినియోగంలో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. కాళ్లు రెండూ విరగడంతో 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

గోవులను వధిస్తే జైలు కెళ్లడం ఖాయం

- సోషల్ మీడియాపై నిరంతరం నిఘా
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: గోవులను వధిస్తే జైలు కెళ్లడం ఖాయమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఈనెల 29న హిందువులకు పవిత్రమైన తొలి ఏకాదశి, ముస్లింలకు పర్వదినమైన బక్రీద్ పండుగలు రెండు ఒకే రోజున ఉన్నందున ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో తమ ఇష్టదైవాలను ఆరాధించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాలు, మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసిన, వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాపట్ల జిల్లాలో నోడల్ ఆఫీసర్ గా బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులును నియమించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లఘిస్తే 9440796165 కు కాల్ చేసి నోడల్ ఆఫీసర్ టి.వెంకటేశులు, జిల్లా హెల్ప్ లైన్ నంబర్ 8333813228, డయల్ 100 కు, 112 లకు కాల్ చేసి సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రికెటర్ అంబటి సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: దేశానికి ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు ఎనలేని సేవలు అందజేసారని మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ , ప్రభుత్వ క్రిస్టియన్ వ్యవహారాల గౌరవ సలహాదారుడు మద్దు బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలను ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అంబటి సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఫాదర్ బాలస్వామి క్రికెటర్ అంబటి రాయుడిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజానికి సేవలందించేలా కృషిచేయాలని చెప్పారు. అనంతరం మండలకేంద్రంలోని తూర్పు బజారులోని మేనమామ కొలగాని రవికుమార్ నివాసానికి నేషనల్ ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు వచ్చారు. అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఫిరంగిపురంలోని బాలఏసు దేవాలయంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయ విచారణ గురువులు బాలస్వామి, సహాయవిచారణ గురువులు అనిల్‌కుమార్ అంబటిని ఆశీర్వదించారు. అనంతరం సెయింట్ పాల్స్ హైస్కూల్‌లోని విద్యార్థులతో కొద్దిసేపు రాయుడు ముచ్చటించారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే పథకాలు

ఆర్జేడీ సుబ్బారావు

మార్టూరు: విద్యార్థుల ఆశయాలు, ఆలోచనలకు నిర్మాణాత్మక చేయూతనిచ్చి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేయడం కోసమే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వీ సుబ్బారావు అన్నారు. బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. జగనన్న అమ్మఒడి, ఆణిముత్యాలు, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలు అందుతున్న తీరు గురించి విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడుతూ పథకాలను వినియోగించుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులను ప్రశ్నల ద్వారా వారి సామర్థ్యాలను పరిక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాచిన చలపతి పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

కారంచేడు: ఆటో నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జీ శ్రీనివాసరావు వివరాలు.. మండలంలోని స్వర్ణ ఎస్సీ కాలనీకి చెందిన దేవరపల్లి థామస్(60) బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి యద్దనపూడి మండలం తనుబొద్దివారిపాలెంలోని వారి బంధువుల ఇంట జరిగే వివాహ కార్యక్రమానికి ఆటోలో సోమవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారంచేడు–స్వర్ణ రోడ్డులో అర్ధ రాత్రి దాటిన తరువాత ఆటో గేదెను గమనించక ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఆటోలో కూర్చొని ఉన్న థామస్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.